దేవాలయాలకు పూర్వవైభవం

- రూ.70కోట్లతో ఆలయాల జీర్ణోద్ధరణ పనులు
- శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయాన్ని పరిశీలించిన మంత్రి బుగ్గన



యస్ గుండాల దేవాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన



ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తతో మాట్లాడుతున్న మంత్రి

డోన్: దేవాలయాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నామని, పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. రూ.70కోట్లతో డోన్ నియోజక వర్గంలోని శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి, కంబగిరి స్వామి, చెన్న కేశవ స్వామి ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టామని గుర్తు చేశారు. మండలంలోని స్తోత్రం గుండాల గ్రామంలో శ్రీ కృష్ణ దువరాయ కాలంలో నిర్మిచిన ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో రూ. 5కోట్లతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులను మంగళవారం మంత్రి పరిశీలించారు. ఆలయంలో జరుగుతున్న పనుల తీరుపై ఆరా తీశారు. గర్భ గుడి, లక్ష్మీదేవీ, భూదేవి, హనుమాన్ ఆలయాల నిర్మాణ పనులపై బుగ్గన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ ప్రాకారంతో పాటు గాలి గోపురం పునఃనిర్మాణం పనులలో జాప్యం తగదని దేవాదాయ ధర్మాదాయ అధికారులను హెచ్చరించారు. ఎనిమిది నెలల్లో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని టీటీడీ స్తపతి సుబ్రహ్మణ్యం, ఈఈ సతీష్ మంత్రికి విన్నవించారు. అభివృద్ధి పనుల్లో ఏ మాత్రం జాప్యం చేయొద్దని, త్వరగా పూర్తి చేయాలని మంత్రి వారికి సూచించారు.

టీటీడీ కల్యాణ మండప పనుల భేష్

ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులను పరిశీలించిన మంత్రి దేవాలయంలో కలియ తిరిగారు. అనంతరం ప్రాంగణంలో నిర్మిస్తున్న విడిది, వంట గదులతో పాటు కల్యాణ మండపం పనులను పరిశీలించారు. వీటిని అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నట్లు డీఈఈ ప్రసాద్ మంత్రికి వివరించారు. పనులు భేషుగ్గా జరుగుతున్నాయని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో డోన్‌తో పాటు గుండాల టీటీడీ కల్యాణ మండపాలను ప్రజలకు అందుబాటు తెస్తామని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి స్పష్టం చేశారు. మంత్రి వెంట టీటీడీ ఏఈ రవి శేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్ నవీన్, మద్దిలేటి స్వామి, గుండాల చెన్న కేశవ స్వామి దేవస్థానాల ఈఓలు పాండు రంగా రెడ్డి, ఈఓ హనుమంత రావు, ధర్మ కర్త వెంకటయ్య, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుణాం తిరుమల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిసామి, సర్పంచ్ తోజోమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డారెడ్డి, సుదాకర్‌రెడ్డి, తపాల మద్దిలేటి, మల్యాల భాస్కర్ రెడ్డి, యాపదిన్నెరసింహా రెడ్డి, గుండాల ప్రసాద్, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర తదితరులు ఉన్నారు.

రూ.70కోట్లతో నియోజక వర్గంలోని శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి, కంబగిరి స్వామి, చెన్న కేశవ స్వామి ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టామన్నారు. కొందరి టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారి అభివృద్ధి పనులకు అడ్డు పడుతున్నారని మంత్రి బుగ్గన మండి పడ్డారు.

నిర్మాణం పనుల్లో నాణ్యత ఖచ్చితంగా ఉండాలని మంత్రి బుగ్గన కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి ని ఆదేశించారు. మంత్రి వెంట టిటిడి ఎఈ రవి శేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్ నవీన్, మద్దిలేటి స్వామి దేవస్థానం ఈఓ పాండు రంగా రెడ్డి, గుండాల చెన్న కేశవ స్వామి దేవస్థాన ఈఓ హనుమంత రావు ధర్మ కర్త వెంకటయ్య, మీట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపి రేగటి రాజ శేఖర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు,జడ్పిటీసి బద్దల రాజ్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు తిరుణాం తిరుమల్ రెడ్డి, వైస్ ఎంపీపి ఎర్రిసామి, సర్పంచ్ తోజోమణి, వైఎస్సార్‌సీపి నాయకులు గిడ్డా రెడ్డి, సుదాకర్ రెడ్డి, తపాల మద్దిలేటి, మల్యాల భాస్కర్ రెడ్డి, యాపదిన్నెరసింహా రెడ్డి, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, గుండాల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

బనగానపల్లె రూరల్ : కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్‌డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కేవీకే ప్రధాన అధికారి ధనలక్ష్మీ తెలిపారు. డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు మూడు నెలలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు నాలుగు నెలల శిక్షణ ఉంటుందని, ఇంటర్ పాసై, 18-35 సంవత్సరాల లోపు వయసు కలిగిన నిరు ద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 14వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

స్టడీమెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు స్టడీమెటీరియల్ సద్వినియోగం చేసు కోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్ గౌస్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సెమిస్టర్, పీజీ పరీక్ష ల మెటిరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ,పట్టుదలతో చదవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాబునాథ్, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ రామన్న, డాక్టర్ రామకృష్ణ, కౌసల్యాదేవి, వహిదా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కూలీలతో మాట్లాడుతున్న డాక్టర్ సురేంద్రకుమార్

డోన్ రూరల్ : ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్‌మెన్ డాక్టర్ సురేంద్రకుమార్ సూచించారు. మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ సుకుమార్, టీఏ శ్రీనివాసరాజ్, ఎఫ్ఏలక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహేష్



కోవెలకుంట్ల: మీ గడపకు దళిత ఆత్మబంధువు యాత్ర విద్యార్థి సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మహేష్‌ను మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కుల, మత రహిత సమాజ స్థాపనకు కొనసాగే యాత్రను విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

పూదోట ఆశ్రమంలో వరుణ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో మంగళవారం ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, జయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో వరుణ హోమం నిర్వహించారు. వేదపండితులు బాలజీ స్వామి, అర్చకులు ప్రభాకర్ శర్మ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భేతేశ్వర శివలింగానికి సామూహికంగా జాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వాసులు సోమ ఈశ్వర ప్రసాద్, శేషమోహన్, నాగమోహన్, సముద్రాల దామోదరయ్య, రామకృష్ణయ్య, గోవిందు, విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉన్నత విద్యను అభ్యసించాలి

ప్యాపిలి: విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉన్నత చదువులు చదవాలని సీఐ సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో మంగళవారం ఆయన ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. సీఐతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు జనార్ధన్ రెడ్డి ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

సంజామల: దొర్నిపాడు మండలం ఉమాపతి నగరానికి చెందిన అహమ్మద్ హుస్సేన్ కుమారుడు సుభాన్ (22) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. సంజామలకు చెందిన మహమ్మద్ హుస్సేన్ కుమార్తె హసీన భానుతో సుభాన్‌తో ఏడాది క్రితం వివాహం అయ్యింది. బట్టలు పెడుతామంటే సంజామలకు భార్యభర్తలు వచ్చారు. భార్యతో గొడవపడిన సుభాన్ సోమవారం విషపూరిత గులికలు మింగాడు. చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. మంగళవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



కొప్పుల శివారెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొప్పుల వెంకట శివారెడ్డి(59) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆయనను పది రోజుల క్రితం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. శివారెడ్డి మృతి పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



గుళ్లదూర్తిలో శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సుధాకర్

కోవెలకుంట్ల: ఈ ఏడాది సాగు చేసిన పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో ఏఓ నిరంజన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి, పప్పుశనగ, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున ఇమామెక్టిన్ బెంజియేట్ లేదా కొరాజిన్ మందులను పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. అలాగే శనగ పంటలో అక్కడక్కడా మొదలుకుళ్లు, ఎండు, వేరుకుళ్లు తెగులు గమనించామన్నారు. తెగుళ్ల ఆశించి ఎండిపోయిన మొక్కలను తొలగించాలన్నారు. తర్వాత ఎకరాకు 200 లీటర్ల నీటిలో 600 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 400 గ్రాముల కార్బన్‌డిజమ్ పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు నివారణకు 200 లీటర్ల నీటిలో 200 గ్రాముల కార్బండిజమ్ లేదా 200 గ్రాముల ప్రోపినోకొనజోల్ మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

టీడీపీ వీడీ వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న ముస్లిం సోదరులు

బనగానపల్లె : పట్టణంలోని టీడీపీకి చెందిన ముస్లిం మైనార్టీలు అషరఫ్, జైను, సలీం, షాబూల్, మహబూబ్ పీరా, మౌలాలి, కరిముల్లా, మహమ్మద్‌గౌస్, పటాన్, అమీర్‌అబ్బాస్, జాబీర్‌గౌస్ నూర్, అబ్దుల్లా, అమీర్‌లతో పాటు మరి కొందరు తెలుగుదేశం పార్టీని వీడీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళ వారం రాత్రి పట్టణంలోని ఖాజీవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పార్టీ కండవ వేసి సాదారంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పట్టణంలో ముస్లిం సోదరులకు రూ.68 లక్షలతో శ్మశానవాటిక ప్రహరీ, రూ.40లక్షలతో షీయా మతస్తులకు ఇబాదత్‌ఖానా నిర్మించడం జరిగిందన్నారు. అలాగే షాధిఖానా నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. గత టీడీపీ పాలనలో అధికారంలో ఉన్న నాయకులు ముస్లిం సోదరుల సంక్షేమానికి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదనే విషయం అందరికీ తెలుసున్నారు. పట్టణంలో చేపట్టిన రోడ్లు అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు ఎన్నో అవరోధాలు సృష్టించారని, వాటన్నింటిని ఎదుర్కోని పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను కూడా టీడీపీ నాయకులు రాజకీయంగా వాడుకోవాలనుకోవడాన్ని వారి విజ్ఞాతకే వదలివేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై టీడీపీని వీడి వైస్సార్‌సీపీలో చేరిని ముస్లిం సోదరులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత కాటసాని ఓబులరెడ్డి, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్, మహబూబ్‌అలీ, హసన్, అత్తార్‌అఖీల్, హుస్సేన్, యూనుస్, కలాం, ముక్తార్, ఖానిక్, బబ్లూ, సికిందర్, షాషా, షేక్‌బురాన్, మహబూబ్‌బాషా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి: ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటనష్టం వాటిల్లిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తప్పనిసరిగా అండగా ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వైస్ ఎంపీపీ రాజా రూపారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమర్పించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు పంట దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారని వ్యవసాయాధికారి రాజేశ్ తెలిపారు. అయితే శాటిలైట్ నివేదిక కారణంగా ప్యాపిలి మండలం కరువు మండలాల జాబితాలో లేదని ఆయన తెలిపారు. స్పందించిన జెడ్పీటీసీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈ సమస్యను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రెండో జాబితాలో కరువు మండలంగా ప్యాపిలి మండలానికి చోటు దక్కవచ్చన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు సక్రమంగా పని చేసేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డీటీ మారుతి, ఎంఈవో వెంకటేశ్ నాయక్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు ప్రభాకర్ రెడ్డి, రవి కుమార్, వినయ్ కుమార్, వైద్యాధికారిణి నుస్రత్ ఉ జొహర, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్యాపిలికి మంత్రి బుగ్గన రాక

ప్యాపిలి: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి బుధవారం ప్యాపిలికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 10 గంటలకు మంత్రి పట్టణంలో జరుగుతున్న షాదీఖానా, ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జరుగుతున్న పార్కు నిర్మాణ పనులను పరిశీలించనున్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

సంజామల: మండల కేంద్రం సంజామలలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నేల 10వ తేదీన ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. విద్య, వైద్యం, తాగు నీరు తదితర అంశాలపై సభలో చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానినికి తప్పక హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లె, కొండమీదపల్లె గ్రామాల్లో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యక్రమానికి హాజరవుతారని, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు హాజర కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో బుధవారం మరమత్తులు చేపడుతున్నట్లు ఎఇ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్యాపిలి మండలం నల్లమేకల పల్లె 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కొచ్చెర్వు, హుసేనాపురం, నల్లమేకలపల్లి సబ్ స్టేషన్లకు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1గంట వరకు కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజస్థాన్ బండల లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): రాయల్టీ చెల్లించకుండా నాపరాళ్లను అక్రమంగా తరలిస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీని సీజ్ చేసినట్లు మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం డోన్ నియోజకవర్గంలోని బేతంచర్లలో జరిగిన దాడుల్లో రాజస్థాన్‌కు చెందిన లారీని తనిఖీ చేసి రాయల్టీ చెల్లించకపోవడంతో రూ.45వేలు జరిమానా విధించామన్నారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

11న ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి కల్యాణ మండపంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. నంద్యాల శాంతిరాం ఆసుపత్రి వైద్యులు బీపీ, షుగర్‌తోపాటు, గుండె, కంటి పరీక్షలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైనవారికి ఈసీజీ, 2డీఎకో తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

13,215 మందికి రైతు భరోసా

సంజామల: వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ ద్వారా మండలంలో 13,215 మందికి రైతులకు లబ్ధి చేకూరిందని ఏఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. మెదటి విడతలో రూ. 7500 రైతు భరోసా రైతులకు జమ అయిందని, రెండవ విడుత కింద ఒక్కో రైతుకు రూ.4వేలు చొప్పున 13,215 మంది రైతులకు రూ.5.28 కోట్లు రైతు బ్యాంక్ ఖాతాలో జమ అయిందని ఏఓ వివరించారు.

నేడు విద్యా సంస్థల బంద్

డోన్ రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని బుధవారం చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి రవి మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిశ్రీ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని దేశసంపద గొల్లగొట్టి కార్పొరేట్ సంస్థల జేబులు నింపుతున్నారని ఆరోపించారు.

ఓపెన్ స్కూల్లో చేరడానికి దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: ఏపీ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని భాగ్యోదయ హైస్కూలు చైర్మన్ కానాల నాగలక్ష్మిదేవి తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 10వ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 16 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు చెల్లించిన ఫీజు రూ. 2వేలు రీయంబర్స్‌మెంట్ వస్తుందని ఆమె తెలిపారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

డోన్ రూరల్ : ప్యాపిలి, డోన్‌ను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక నక్కిరామన్న భవనంలో మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాలు లేక రైతులు అల్లాడి పోతున్నారని, ప్రభుత్వం స్పందించి కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో నాయకులు సుంకయ్య, రాధాకృష్ణ, మోటారాముడు, పట్టణ కార్యదర్శి నారాయణ, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

కొలిమిగుండ్ల: గ్రామాల్లోనే ప్రజలకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించిందని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో క్యాంపులు ఏర్పాటు చేయగా సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, కంటి పరీక్షలు తదితర వ్యాధులకు పరీక్షలు చేయించుకునేందుకు 8221 మంది మెడికల్ క్యాంపులకు వచ్చారన్నారు. వ్యాధుల తీవ్రతను బట్టి 122 మందిని ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ, నెట్ వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారన్నారు. ఇందులో ఇప్పటికే 40 మంది రెఫర్ చేసిన ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్నారన్నారు. ఇద్దరికి సర్జరీలు కూడా చేయించుకొని డిశ్చార్జ్ అయ్యారని ఆయన తెలిపారు. అందరి సహకారంతో మెడికల్ క్యాంపులు విజయవంతంగా నిర్వహించామని ఎంపీడీఓ చెప్పారు.

లైసెన్స్ వ్యాపారులే బాణసంచా విక్రయించాలి



మార్కెట్ యార్డులో స్టాళ్ల ఏర్పాటుకు పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

- ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : బాణ సంచా సామాగ్రిని లైసెన్స్ వ్యాపారస్తులు విక్రయించాలని, అనాధికారికంగా చేపడితే క్రిమినల్ కేసు నమోదుతోపాటు దుకాణాలను సీజ్ చేస్తామని ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రానున్న దీపావళి పండుగ పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం డివిజన్‌లోని బాణా సంచా విక్రయించే దుకాణందారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి వ్యాపారి లైసెన్స్ తప్పని సరిగా రెన్యూవల్ చేయించు కోవాలన్నారు. నిర్దేశించిన ప్రాంతంలోనే విక్రయాలు జరపాలని ఆదేశించారు. దీపావళి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలకు దూరంగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని, నిర్దేశించిన నమూన పద్ధతిలో స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి అంగడి వద్ద రెండు డ్రమ్ముల నీరు, ఇసుక తప్పని సరి అని, సమీపాన బీడి, సిగరెట్ నిషేధం ఆజ్ఞలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణాల్లో 14 సంవత్సరాల లోపు పిల్లలు ఉండరాదని నిబంధన తప్పకుండ పాటించాలని సూచించారు. అంతకు ముందు బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు గుత్తిరోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆర్డీఓ, డీఎస్పీ స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి తహసీల్దార్‌లు విద్యాసాగర్, చంద్రశేఖర్‌వర్మ, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బాణా సంచా విక్రయ కేంద్రాల ఏర్పాటు కోసం గుత్తి రోడ్డు లోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్థల పరిశీలన చేసారు.

మద్దిలేటయ్యకు ప్రత్యేక పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

బేతంచెర్ల: ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో లోక కళ్యాణర్థం వరుణ దేవుని అనుగ్రహం కోసం 3 రోజుల వరుణ యాగంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ దేవస్థానం ఈఓ పాండు రంగా రెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి వరుణ యాగాన్ని ప్రారంభించారు. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచణం, పంచగవ్య ప్రాశనం, రుత్విగ్వరుణం,వరుణ సూక్త పారాయణ, మహాముని జపం నిర్వహించారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో మంగళవారం వర్షం కోసం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకొని గ్రామ చావిడి నుంచి శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం మీదుగా శివారులో ఉన్న గంగమ్మగుడి నీటి కుంట వరకు ఊరేగింపుగా వచ్చారు. అమ్మవారికి నైవైద్యంతోపాటు చీర, జాకెట్, పసుపు కుంకుమ్మ, పూలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. గంగమ్మకు ఇలా పూజలు నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు.

పుట్ట పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్ట పెద్దమ్మ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు.